పాఠశాలకు 5 ఎకరాల స్థలం కేటాయించాలి


ఎంపీ ఈటల రాజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నేతలు, ఉపాధ్యాయులు

దుండిగల్‌: బౌరంపేట ప్రభుత్వ పాఠశాలకు ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని బీజేపీ నేతలు కోరారు. ఈ మేరకు ఎంపీ ఈటల రాజేందర్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అరకొర సదుపాయాలతో కేవలం ఎకరా స్థలంలోనే ప్రాథమిక, ఉన్నత పాఠశాలలు ఉన్నాయని, సుమారు 900 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని వివరించారు. ఆట స్థలం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల కోసం బౌరంపేటలోని ప్రభుత్వ భూముల్లో ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని కోరారు. అదే విధంగా మంచి నీటి సౌకర్యం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తక్షణమే బోరు వేసి నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీధర్‌, డి ప్రభాకర్‌ రెడ్డి, గోనె మల్లారెడ్డి, నల్ల రాంచంద్ర రెడ్డి, సీతారాం రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.

పేదలకు వరం.. సీఎంఆర్‌ఎఫ్‌


ఎల్‌ఓసీ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్‌

కుత్బుల్లాపూర్‌: ఆపదలో ఉన్న నిరు పేద కుటుంబాలకు సీఎం రిలీఫ్‌ ఫండ్‌ వరం లాంటిదని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ నేత కూన శ్రీశైలంగౌడ్‌ అన్నారు. కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గానికి చెందిన శ్రీవిద్య అనారోగ్యంతో శస్త్ర చికిత్స నిమిత్తం నిమ్స్‌ ఆసుపత్రిలో చేరింది. ఆమె భర్త కూన శ్రీశైలం గౌడ్‌ని సంప్రదించి.. ప్రభుత్వ పరంగా ఆర్థిక సాయం అందించేందుకు సహాయం చేయాలని కోరారు. తక్షణమే స్పందించిన ఆయన జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌ బాబు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి లక్ష రూపాయల ఎల్‌ఓసీని మంజూరు చేయించారు. మంజూరైన ఎల్‌ఓసీని బాధిత కుటుంబానికి శనివారం శ్రీశైలంగౌడ్‌ సచివాలయ ఆవరణలో అందజేశారు. ఆపద సమయంలో స్పందించి, తక్షణ సహాయం అందించిన శ్రీశైలంగౌడ్‌కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్‌, ఉప్పల్‌ నియోజకవర్గాల కాంగ్రెస్‌ ఇన్‌చార్జులు వజ్రేష్‌ యాదవ్‌, పరమేశ్వర్‌ రెడ్డి పాల్గొన్నారు.

బస్తీల్లో దశల వారీగా వైద్య శిబిరాలు


ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సొంటిరెడ్డి పున్నారెడ్డి

సుభాష్‌నగర్‌: ఎస్పీఆర్‌ ట్రస్టు ఆధ్వర్యంలో ఇక నుంచి దశల వారీగా బస్తీల్లో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు ట్రస్ట్‌ చైర్మన్‌ సొంటిరెడ్డి పున్నారెడ్డి అన్నారు. గాజులరామారం డివిజన్‌ చిత్తారమ్మదేవినగర్‌ లో శనివారం ఎస్పీఆర్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో స్థానికంగా ఉన్న ఎస్పీఆర్‌ గ్లోబల్‌ స్కూల్‌లో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరంలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యుల ఆధ్వర్యంలో 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించి చూపు మందగించిన వారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ..పేద, మధ్య తరగతి వారిని దృష్టిలో పెట్టుకొని ఎస్పీఆర్‌ ట్రస్ట్‌ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. మరో 10 రోజుల్లో ఈ వైద్య శిబిరం మళ్లీ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ మూడవ ఫేజ్‌లోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అయ్యప్ప స్వాములకు అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కార్పొరేటర్‌ మందడి శ్రీనివాసరావుతో కలిసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అయ్యప్ప స్వాములకు ప్రతి సంవత్సరం అన్నదానం చేయటం సంతోషకరమైన విషయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ జూపల్లి సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్‌ బాబూరావు, ఆలయ చైర్మన్‌ కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికలో వసతులు కల్పించాలి



మోతీనగర్‌: ముస్లిం శ్మశాన వాటికలో మౌలిక వసతులు కల్పించాలని ముస్లిం మత పెద్దలు కోరారు. కార్పొరేటర్‌ సబిహాబేగంను ఆమె కార్యాలయంలో రామారావునగర్‌ ముస్లిం మత పెద్దలు శనివారం కలిశారు. శ్మశాన వాటికలో రేకుల షెడ్డు, బాత్‌రూం, ప్రహరీ నిర్మాణం, పెయింటింగ్‌, వాటర్‌ ట్యాంక్‌, ఇతర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం కార్పొరేటర్‌ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టికి సమస్యలను తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ ప్రధాన కార్యదర్శి పిల్లి తిరుపతి, నాగుల సత్యం, మహ్మద్‌ మన్సూర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఏళ్లుగా ఖాళీలే..!

పురపాలికల్లో భర్తీకి నోచుకోని పారిశుధ్య కార్మికులు

- లోపిస్తున్న స్వచ్ఛత
- 13 మున్సిపాలిటీల్లో అవుట్‌ సోర్సింగ్‌ కింద కేవలం 1746 మందే
- జనాభా ప్రతిపాదికన కార్మికులను భర్తీ చేయాలంటున్న పుర ప్రజలు



సాక్షి,సిటీబ్యూరో: మున్సిపాలిటీల్లో ఏళ్లుగా పారిశుద్ధ్య కార్మికుల భర్తీ లేకపోవడంతో స్వచ్ఛత లోపిస్తున్నది. డ్రైనేజీలు, రహదారులు, వీధులు శుభ్రం చేసే స్వీపర్లు, ఇతర కార్మికుల సరిపడా లేక పట్టణాల్లో పారిశుధ్యం పడకేస్తున్నది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలికల్లో దాదాపు ఇదే పరిస్థితి నెలకొన్నది. ఏళ్లుగా పట్టణాల్లో పారిశుధ్య విభాగాల్లో ఒక్క పోస్టు కూడా భర్తీ కాలేదంటే పరిస్థితి ఎలా ఉందో విధితమవుతోంది.

నిబంధనలకు తూట్లు..

- రాష్ట్ర పురపాలక శాఖ పరిపాలనా విభాగం నిబంధనల ప్రకారం ప్రతి 10 వేల జనాభాకు 28 మంది రెగ్యులర్‌ పారిశుధ్య కార్మికులు పని చేయాల్సి ఉంటోంది. మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని బోడుప్పల్‌, పీర్జాదిగూడ, జవహర్‌ నగర్‌ నిజాంపేట మున్సిపల్‌ కార్పొరేషన్లు, కొంపెల్లి, దుండిగల్‌, మేడ్చల్‌, నాగారం ,తూంకుంట, గుండ్లపోంచపల్లి, దమ్మాయిగూడ, పోచారం, ఘట్‌కేసర్‌ మున్సిపాలిటీల్లో 2011 జనాభా లెక్కల ప్రకారం 4,24,239 జనాభా ఉంది. ప్రస్తుతం ఆయా పురపాలక సంఘాల్లో సుమారు 10 లక్షలకు పైగా జనాభా ఉంటుందని అంచనా. ఇటీవలే 7 మున్సిపాలిటీల పరిధిలోకి 28 గ్రామ పంచాయతీలు విలీనమైన విషయం తెలిసిందే. ఈ పురపాలక సంఘాల్లో 1746 మంది పారిశుధ్య కార్మికులు అవుట్‌ సోర్సింగ్‌ కింద పని చేస్తున్నారు. అయితే పెరుగుతున్న జనాభా, కాలనీలకు అనుగుణంగా పారిశుధ్య కార్మికుల సంఖ్యను పెంచకపోవడంతో ప్రస్తుతం పని చేస్తున్న వారిపైనే భారం పడుతోంది. దీంతో పలు పురపాలికల్లో చెత్త సమస్య తీరని వ్యథగా దర్శమిస్తోంది. సంబంధిత అధికారులు కూడా ఉన్న సిబ్బందితోనే పనులు చేయించాల్సి వస్తోంది.
- గ్రేటర్‌ హైదరాబాద్‌ శివారులోని 13 పురపాలికల్లో ప్రస్తుత జనాభా 10 లక్షల దాటవచ్చునంటున్నారు. ఈ లెక్క ప్రకారం ఆయా పురపాలకల్లో 2,840 మంది పారిశుధ్య కార్మికులు పనిచేయాల్సి ఉంటోంది.
- 13 పురపాలక సంఘాల్లో ప్రస్తుతం రెగ్యులర్‌ పారిశుధ్య కార్మికులు లేకపోవడంతోఅవుట్‌ సోర్సింగ్‌ సేవల కింద నియమించిన కార్మికులతోనే పారిశుధ్య వ్యవస్థను కొనసాగిస్తున్నారు.

ప్యానల్‌ పోస్టులకే ప్రాధాన్యం

పురపాలికల్లో కమిషనర్లు, ఇంజినీర్లు, టౌన్‌ ప్లానింగ్‌ అధికారులు, మేనేజర్లు, అకౌంటెంట్లు, ఆర్‌ఐలు, క్లర్కులు, బిల్‌ కలెక్టర్లు వంటిప్యానల్‌ పోస్టులు మాత్రమే భర్తీ చేస్తున్న ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల విషయాన్ని మాత్రం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. గతంలో టీఎస్‌పీఎస్సీ ద్వారా జిల్లాలోని పురపాలికల్లో ఇంజినీరింగ్‌, టౌన్‌ ప్లానింగ్‌, శానిటేషన్‌, రెవెన్యూ విభాగాల్లో ప్యానల్‌ పోస్టులు భర్తీ అయ్యాయి. అయితే అవసరమున్న పారిశుధ్య కార్మికుల పోస్టులు మాత్రం ఖాళీగానే ఉండిపోయాయి.

పురపాలక సంఘాల వారీగా ..

మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలకల్లో అవుట్‌ సోర్సింగ్‌ కింద 1746 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. ఇందులో మున్సిపాలిటీల వారీగా పారిశుధ్య కార్మికుల సంఖ్య ఇలా ఉంది. ఫీర్జాదిగూడలో 56 పారిశుధ్య కార్మికులు, నిజాంపేటలో 248, నాగారంలో 145, మేడ్చల్‌లో 139, కొంపెల్లిలో 188, జవహర్‌నగర్‌లో 90 మంది పని చేస్తున్నారు. బోడుప్పల్‌లో 182, దుండిగల్‌లో 150, ఘట్‌కేసర్‌లో 86, గుండ్లపోచంపల్లిలో 120, దమ్మాయిగూడలో 157, పోచారంలో 111, తూంకుంటలో 74 మంది అవుట్‌ సోర్సింగ్‌ కింద సేవలందిస్తున్నారు. అయితే ఇటీవల 7 మున్సిపాలిటీల పరిధిలో విలీనమైన 28 గ్రామ పంచాయతీల కార్మికుల సేవలను పారిశుధ్య పనులకు ఉయోగించుకుంటున్న పుర అధికారులు వారిని అధికారిగా మున్సిపల్‌ కార్మికులుగా గుర్తించాలని కార్మిక సంఘాలు కోరుతున్నాయి.

కీసర ఆలయానికి ప్రత్యేక బస్సులు

జీడిమెట్ల: కార్తీక మాసం సందర్భంగా జీడిమెట్ల డిపో, గండిమైసమ్మ నుంచి కీసర రామలింగేశ్వరస్వామి గుడి వరకు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు డీఎం ఆంజనేయులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం, సోమవారం గండిమైసమ్మ, జీడిమెట్ల డిపో నుంచి ఉదయం 6:30, 7:30 గంటలకు కీసరకు, తిరిగి కీసర నుంచి సాయంత్రం 5:00, 6:00గంటలకు బస్సులను నడుపనున్నారు. ప్రయాణికులు ఇట్టి అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

బైకు అదుపుతప్పి.. అక్కడికక్కడే మృతి


సాయికృష్ణారెడ్డి (ఫైల్‌)

కుత్బుల్లాపూర్‌: బైక్‌ అదుపు తప్పడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన పేట్‌బషీరాబాద్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల గాయత్రి నగర్‌లో నివాసముండే మహిపాల్‌రెడ్డి కుమారుడు సాయికృష్ణారెడ్డి(24) శనివారం తెల్లవారుజాము 3:35 గంటలకు గాయత్రీనగర్‌ నుంచి అల్వాల్‌ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. మార్గమధ్యలో వెన్నలగడ్డ పోచమ్మ ఆలయ సమీపంలో బైకు అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందాడు. అతి వేగం కారణంగానే ప్రమాదం చోటు చేసుకుందని పోలీసులు గుర్తించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

బీసీల ప్రాధాన్యత కోసమే కుల గణన

శాసన మండలి చీఫ్‌ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి

కుత్బుల్లాపూర్‌: బీసీలకు అన్ని రంగాల్లో సముచిత న్యాయం చేసేందుకే రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కార్యక్రమాన్ని చేపట్టిందని శాసన మండలి చీఫ్‌ విప్‌ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి అధ్యక్షతన శనివారం కొంపల్లి కేవీఆర్‌ గార్డెన్స్‌లో కులగణన సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుల గణన సందర్భంగా జరిగే కుటుంబ సర్వేకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కాంగ్రెస్‌ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు తమ ప్రాంతాల్లో జరిగే కులగణనలో భాగస్వాములై అధికారులకు సహకరించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ మల్కాజిగిరి ఇన్‌చార్జి సునీతామహేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సుధీర్‌ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, కూన శ్రీశైలంగౌడ్‌, కుత్బుల్లాపూర్‌ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్‌ హన్మంత రెడ్డి, జంగయ్య యాదవ్‌, పరమేశ్వర్‌ రెడ్డి, బండి రమేష్‌, డాక్టర్‌ జి.వి.వెన్నెల, మాజీ డీసీసీ అధ్యక్షుడు ప్రతాప్‌, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్‌ సభ్యురాలు జ్యోత్స్నారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రైతు కమిషన్‌ సభ్యురాలు భవానీ, జిల్లా నాయకులు, బ్లాక్‌ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్‌ నాయకులు పాల్గొన్నారు.

మహదేవపురంలో కోటి దీపోత్సవం


కోటి దీపోత్సవంలో సాంస్కృతిక ప్రదర్శన


దీపోత్సవంలో పాల్గొన్న భక్తులు

సుభాష్‌నగర్‌: కార్తీక మాసాన్ని పురస్కరించుకుని గాజులరామారం డివిజన్‌ మహదేవపురంలో శనివారం రాత్రి శ్రీ నకులేశ్వరిదేవి సిద్ధిపీఠం, నందు పంతుల మిత్రబృందం ఆధ్వర్యంలో కోటి దీపోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కోటి దీపోత్సవంలో మహదేవపురం చుట్టు పక్కల కాలనీలు, బస్తీల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలను వెలిగించారు.

అభివృద్ధే ధ్యేయంగా పనులు

ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంక్షేమ సంఘాల సభ్యులు

కుత్బుల్లాపూర్‌: నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పనులు చేస్తూ ముందుకు సాగుతున్నానని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ అన్నారు. పేట్‌ బషీరాబాద్‌లోని ఎమ్మెల్యే క్యాంప్‌ కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, సంక్షేమ సంఘాల సభ్యులు కలిసి పలు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. వెంటనే ఆయా శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. అదే విధంగా పలువురు ఆయనకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య విద్యార్థికి ఆర్థికసాయం


డానియల్‌కు చెక్కును అందజేస్తున్న శ్రీనివాస్‌

జీడిమెట్ల: చదువుకునే విద్యార్థులకు ఆర్థికసాయం చేయడం సంతోషంగా ఉందని దాత మొరిశెట్టి శ్రీనివాస్‌ అన్నారు. గాజులరామారానికి చెందిన డానియల్‌ నాయక్‌ చిత్తూరులోని అపోలో మెడికల్‌ కళాశాలలో ఎంబీబీఎస్‌ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. డానియల్‌కు చదువు నిమిత్తం ఆర్థికంగా అవసరం ఉందని హార్ట్‌ టూ హెల్ప్‌ చారిటబుల్‌ ట్రస్టు ద్వారా తెలుసుకున్న శ్రీనివాస్‌ తన పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం డానియల్‌కు రూ.10వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో హార్ట్‌ టూ హెల్ప్‌ చారిటబుల్‌ ట్రస్ట్‌ చైర్మన్‌ మూడె రవినాయక్‌ నాగమణి, మేనేజింగ్‌ ట్రస్ట్‌ లక్ష్మి పాల్గొన్నారు.

ప్రవీణ గ్యాస్‌ ఏజెన్సీ యూనియన్‌ అధ్యక్షుడిగా చింతల నాగరాజు


చింతల నాగరాజును సన్మానిస్తున్న కార్మికులు

కుత్బుల్లాపూర్‌: కార్మికుల శ్రేయస్సు, న్యాయమైన హక్కుల కోసం నిరంతరం పోరాడుతానని కార్మిక నేత చింతల నాగరాజు అన్నారు. ప్రవీణ గ్యాస్‌ ఏజెన్సీ యూనియన్‌ అధ్యక్షుడిగా నాగరాజు వరుసగా ఐదవసారి ఎన్నికయ్యారు. చింతల్‌లోని ఆయన నివాసంలో కార్మికులు జనరల్‌ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికులు వినియోగదారులకు సరైన సమయంలో గ్యాస్‌ డెలివరీ చేసి గ్యాస్‌ కంపెనీ, యాజమాన్యానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. అనంతరం కార్మికులు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ దేవేందర్‌, గోపాల్‌ రావు, కమిటీ సభ్యులు జీఎస్‌ మధుసూదన్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, రమేష్‌, రాము, కొండల్‌, రవి, రాజు, బుచ్చిరెడ్డి, గిరి నాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌ వినియోగదారుల సదస్సు

జీడిమెట్ల: జీడిమెట్లలోని సబ్‌ డివిజన్‌ కార్యాలయంలో విద్యుత్‌ వినియోగదారులతో కన్స్యూమర్‌డే నిర్వహించనున్నట్లు జీడిమెట్ల డివిజనల్‌ ఇంజనీర్‌ శ్రీనివాస్‌ ఓ ప్రకటనలో తెలిపారు. జీడిమెట్ల డివిజన్‌ పరిధిలోని విద్యుత్‌ వినియోగదారులకు విద్యుత్‌ సరఫరాలో లోవోల్టేజీ, మీటర్లు, కొత్త కనెక్షన్‌లు, ఎక్కువ బిల్లులు రావడంలాంటి ఏవైనా సందేహాలు ఉండే ఉదయం 10 గంటల నుంచి నిర్వహించే కార్యక్రమంలో వచ్చి నేరుగా సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని డీఈ పేర్కొన్నారు.

నేటి నుంచి అయ్యప్ప స్వాములకు నిత్యాన్నదానం

కేపీహెచ్‌బీకాలనీ: హరిహర పుత్ర భక్త సమాజం ఆధ్వర్యంలో ఆదివారం నుంచి డిసెంబర్‌ 31వ తేదీ వరకు అయ్యప్ప స్వాములకు నిత్య అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కేపీహెచ్‌బీ కాలనీ, 3వ ఫేజ్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిత్య అన్న దాన సమారాధన కార్యక్రమం జరుగుతుందని ఆలయ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 12.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు జరిగే అన్న సమారాధనను విజయవంతం చేయాలన్నారు.

చెత్త వ్యర్థాలను తొలగించరా?

జీడిమెట్ల ఎస్వీ కో ఆపరేటివ్‌ సొసైటీలో కొంత మంది వివిధ ప్రాంతాల నుంచి చెత్తాచెదారాలను తీసుకొచ్చి రోడ్లపై దంపింగ్‌ చేసి వెళ్తున్నారు. దీంతో రోడ్లన్నీ చెత్తాచెదారాలతో నిండి తీవ్రమైన దుర్వాసన రోడ్డుపై వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఎస్వీ కో ఆపరేటివ్‌ సొసైటీలో రోడ్లు చెత్తా చెదారాలతో కనిపిస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది రెండు నెలలకు ఒకసారి శుభ్రం చేసి వదిలేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చెత్తను తొలగించి, చెత్త వేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– జీడిమెట్ల


ఎస్వీ కో ఆపరేటివ్‌కు వచ్చే రోడ్డులో చెత్తాచెదారం


సొసైటీలోని సబ్‌స్టేషన్‌ సమీపంలో..

కనుల పండువగా సదర్‌ ఉత్సవం


హస్మత్‌పేటలో దున్నల యజమానులకు బహుమతులను అందజేస్తున్న కార్పొరేటర్‌ నర్సింహయాదవ్‌

ఓల్డ్‌బోయిన్‌పల్లి: విభిన్న అలంకరణలతో అందంగా ముస్తాబైన దున్నలు..డప్పుల దరువులకు లయబద్ధంగా నృత్యాలు.. రాజకీయ నాయకులు, ప్రజల సందడితో ఓల్డ్‌ బోయిన్‌పల్లిలో శుక్రవారం రాత్రి జరిగిన సదర్‌ ఉత్సవం శనివారం తెల్లవారు జాము వరకు కోలాహలంగా జరిగింది. ఓల్డ్‌ బోయిన్‌పల్లి యాదవుల సంఘం, హస్మత్‌పేట్‌, అంజయ్యనగర్‌ యాదవుల ఆధ్వర్యంలో ఉత్సవాలు చివరి వరకు ఉత్సాహంగా కొనసాగాయి. ఉత్సవంలో ఆయా ప్రాంతాలకు చెందిన దున్నపోతులను అలంకరించి విన్యాసాలు చేయించారు. శ్రీకృష్ణుడికి ఘనంగా పూజలు నిర్వహించారు. డప్పుల దరువులతో దున్నలను వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌ ముద్దం నర్సింహయాదవ్‌, కర్రె జంగయ్య, కృష్ణ యాదవ్‌, సంతోష్‌ యాదవ్‌, నంద్‌ యాదవ్‌, కిషోర్‌ యాదవ్‌, నరేందర్‌ యాదవ్‌, కుమార్‌ యాదవ్‌, రాజు యాదవ్‌, చందు యాదవ్‌, మన్నె ఉదయ్‌ యాదవ్‌, మల్లేష్‌ యాదవ్‌, బుర్రి యాదగిరి పాల్గొన్నారు.

మూసాపేట: కైత్లాపూర్‌ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్‌ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా మాజీ కార్పొరేటర్‌ పగుడాల బాబూరావు హాజరయ్యారు. కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్‌, ఐలయ్య యాదవ్‌, ఎల్లేష్‌ యాదవ్‌, వెంకటేష్‌ యాదవ్‌, కర్క పెంటయ్య, కేబుల్‌ శ్రీను, మల్లేష్‌ యాదవ్‌, వీరేశం యాదవ్‌, శ్రీశైలం యాదవ్‌, బాలరాజు యాదవ్‌, కె. సంతోష్‌, యాదయ్య గౌడ్‌, బాలయ్య, అశోక్‌ పాల్గొన్నారు.

మూసాపేట చౌరస్తాలో..

మూసాపేట యాదవ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదర్‌ ఉత్సవాలకు ముఖ్య అతిథులుగా మూసాపేట మాజీ కార్పొరేటర్‌ తూము శ్రావణ్‌కుమార్‌, మాజీ కార్పొరేటర్‌ బాబూరావు హాజరయ్యారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్‌, సీనియర్‌ నాయకులు కర్క పెంటయ్య, ఉప్పు రాము, ఖాజా, రమేష్‌ యాదవ్‌, ఎల్లేష్‌ యాదవ్‌, శ్రీకాంత్‌ యాదవ్‌, కుమార్‌ యాదవ్‌, నర్సింహ యాదవ్‌, గణేష్‌యాదవ్‌, తదితరులు పాల్గొన్నారు.


సదర్‌ ఉత్సవంలో పాల్గొన్న బాబూరావు